క్లుప్తంగా

ఏపీ సీఎం జగన్‌కు స్వాగతం పలికిన ఎమ్మెల్యేలు



వేల్పూర్: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను పరామర్శించడానికి హైదరాబాద్‌కు వచ్చిన ఏపీ సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్వాగతం పలికారు. గురువారం బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న జగన్‌కు వారు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతించారు. అనంతరం జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి కేసీఆర్ ఇంటికి బయల్దేరారు.

తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు

రెంజల్(బోధన్): ప్రభుత్వం 6 గ్యారంటీ పథకాల అమలుకు కోసం నిర్వహిస్తున్న అభయ హస్తం ప్రజాపాలనపై అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని ఎంపీడీవో శంకర్ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో కొందరు వ్యక్తులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ వారిలో అనుమానాలను రేకెత్తిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామాల్లో కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని తెలిపారు. తప్పుడు ప్రచారాన్ని నమ్మకుండా ప్రజలు ఆరు గ్యారంటీ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజాపాలనలో అందిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి ప్రభుత్వానికి అందిస్తామన్నారు.

ఆర్టీసీ డీఎంకు సన్మానం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆంజనేయులను ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. యూనియన్ అధ్యక్షుడు రవిచందర్, గోపి నర్సయ్య, జనార్దన్, రాములు, గంగవ్వ, లక్ష్మి, త్రివేణి, జయకుమార్ పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని పడిలేచిన మర్రిచెట్టు ఆవరణలో ఉన్న శివ సాయి మందిర 11వ వార్షికోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో యజ్ఞంతోపాటు 108 మందితో సాయిసచ్చరిత్ర పారాయణం నిర్వహించారు. భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 11వ తేదీ వరకు ప్రతిరోజూ పారయణ కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బస్టాండ్‌లో కళాజాత

బోధన్‌టౌన్(బోధన్): తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలోని బస్టాండ్‌లో గురువారం కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ రాజన్న మాట్లాడుతూ.. ఎయిడ్స్ వల్ల కలిగే నష్టాలను ప్రజలు గమనించాలని సూచించారు. ప్రజలు భయపడకుండా టెస్టులు చేసుకోవాలని కోరారు. స్నేహ సొసైటీ సభ్యులు సావిత్రి, సంపూర్ణ, సురక్ష కేంద్రం స్రవంతి, జనంపాట సంతోష్, గోపాల్ పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

నవీపేట: ఓటమి పాలయ్యామని అధైర్యపడకుండా పార్టీ పటిష్టతకు కృషి చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాంకిషన్‌రావ్ అన్నారు. మండల కేంద్రంలోని దాస్ గెస్ట్‌హౌజ్‌లో గురువారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలో ఉన్న పదేళ్లకాలంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలు మరిచిపోలేరన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు భవంతి దేవీదాస్, సాయిబాబాగౌడ్, నర్సింగ్‌రావు, తెడ్డు పోశెట్టి, న్యాలకంటి అబ్బన్న, అల్లం రమేశ్, పురుషోత్తంరావు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అక్షింతల పంపిణీ

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో గురువారం ఇంటింటికీ అయోధ్య శ్రీరాముల వారి అక్షింతలను పంపిణీ చేశారు. అక్షింతలతో పాటు పుస్తకాలను అందజేశారు. నరేశ్, నరేందర్, శ్రీకాంత్, వేణుగౌడ్, ప్రభాకర్, భూషణ్ పాల్గొన్నారు.

నిర్మాణ పనులు అడ్డుకుంటున్నారని ఫిర్యాదు

ఖలీల్‌వాడి: సంఘ స్థలంలో నిర్మాణ పనులు చేపడితే అడ్డుకుంటున్నారంటూ మాల సంఘం సభ్యులు సీపీ కల్మేశ్వర్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలూర్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఉన్న మాల సంఘానికి చెందిన 35 గజాల స్థలంలో షట్టర్ నిర్మాణ పనులు చేపడితే సంఘ సభ్యుడైన నరేందర్ అడ్డుకుంటున్నాడని సభ్యులు ఆరోపించారు. అంతేకాకుండా సంఘ సభ్యులపై ఆర్మూర్ సీఐ, సీపీకి తప్పుడు ఫిర్యాదు చేశాడని పేర్కొన్నారు. నిర్మాణ పనులు అడ్డుకుంటున్న నరేందర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీని సభ్యులు కోరారు.

ఫుట్‌పాత్ ఆక్రమణ

- యథేచ్ఛగా దుకాణాల ఏర్పాటు
- చర్యలు తీసుకోని అధికారులు



44వ నంబర్ రహదారి పక్కన ఏర్పాటు చేసిన దుకాణాలు

పెర్కిట్(ఆర్మూర్): రహదారులపై ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలు అక్రమార్కుల కారణంగా నిర్వీర్యమవుతున్నాయి. పాదచారులు, చిన్నారులు నడవడానికి రహదారుల వెంట ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు వ్యాపారాలకు అడ్డాగా మారాయి. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్, మామిడిపల్లి 63, 44వ నంబర్ జాతీయ రహదారుల పక్కన ఐదు సంవత్సరాల క్రితం ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేశారు. ఆర్మూర్ పట్టణం నుంచి మామిడిపల్లి, పెర్కిట్ గ్రామాల నుంచి వెళ్లే రహదారుల పక్కన ఎన్‌హెచ్ఏఐ ఆధ్వర్యంలో ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేశారు. ఆర్మూర్ పట్టణంలోని బస్టాండ్‌తో పాటు, పెర్కిట్‌లో 44వ నంబరు జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ పాఠశాలలను ఆనుకుని ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లను కొందరు అడ్డాగా చేసుకుని వ్యాపారం నిర్వహిస్తున్నారు. జాతీయ రహదారుల కూడలిగా ఉన్న పెర్కిట్ చౌరస్తా వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. అలాగే పక్కనే కూరగాయాల మార్కెట్ ఉండడంతో కొనుగోలుదారుల తాకిడి అధికంగా ఉంటుంది. దీంతో పాటు రహదారి పక్కనే ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఫుట్‌పాత్‌లపై కోకాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేస్తుండడంతో రహదారి ఇరుకుగా మారి పాదచారులకు ఇబ్బందిగా మారింది. కోకాల ఏర్పాటుతో రహదారి ఇరుకుగా మారి రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. కాగా సంవత్సరం క్రితం అప్పటి మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ అక్రమంగా ఏర్పాటు కోకాలను పోలీసు బందోబస్తుతో తొలగించారు. తొలగించిన కొద్ది రోజులకే వ్యాపారులు యథావిధిగా మళ్లీ ఏర్పాటు చేసుకొని అధికారులకు సవాలుగా మారారు. పెర్కిట్‌కు చెందిన కొందరు రాజకీయ పలుకుబడితో కోకాలు ఏర్పాటు చేసి వ్యాపారుల నుంచి నెలనెల అద్దె తీసుకుంటున్నట్లు సమాచారం. అద్దె వసూలు చేస్తున్న వారే తిరిగి కోకాలు ఏర్పాటు చేసి వ్యాపారం కొనసాగేలా వ్యాపారులకు వెన్నుదన్నుగా ఉంటున్నారు. ఐదు నెలల క్రితం పోలీసు బందోబస్తుతో కోకాలను తొలగించడంలో ఆర్భాటం ప్రదర్శించిన మున్సిపల్ అధికారులు.. మళ్లీ కోకాలు ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవడం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో రహదారి పైకి వచ్చి వ్యాపారం చేస్తున్న పండ్ల దుకాణాలను వెనక్కి జరిపించిన అధికారులు ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసుకున్న అక్రమ కోకాలను తొలగించి రహదారిపై ప్రమాదాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తూ కోకాలు ఏర్పాటు చేసి వ్యాపారం చేస్తే చర్యలు తీసుకుంటాం. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే విధంగా ఉన్న కోకాలను స్వచ్ఛందంగా తొలగించాలి. లేదంటే మున్సిపల్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– ప్రసాద్‌చౌహాన్, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

కొనసాగుతున్న ప్రజాపాలన



ఆర్మూర్ మండలం చేపూర్‌లో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు



డొంకేశ్వర్ మండలం తొండాకూర్‌లో గ్రామసభ..

డొంకేశ్వర్/పెర్కిట్/బోధన్‌టౌన్/పోతంగల్: ఆరు గ్యారంటీల అమలుకోసం చేపట్టిన ప్రజాపాలనలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతున్నది. తొండాకూర్, కోమట్‌పల్లి గ్రామాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. తహసీల్దార్ రాములు దరఖాస్తులను స్వీకరించారు. మండల వ్యవసాయ అధికారి జోత్స్నభవాని, సర్పంచులు దేవన్న, నాగరాజు, పంచాయతీ కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు. ఆర్మూర్ మండలం చేపూర్‌లో దరఖాస్తుల స్వీకరణను జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పరిశీలించారు. ఆరుగ్యారంటీలపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు. సర్పంచ్ ఇందూర్ సాయన్న, ఎంపీటీసీ బాలనర్సయ్య, అధికారులు పాల్గొన్నారు. బోధన్ పట్టణంలో నిర్వహించిన ప్రజాపాలన సభల్లో మున్సిపల్ చైర్మన్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి పాల్గొన్నారు. ఆమె వెంట కమిషనర్ ఖమర్ అహ్మద్, కౌన్సిలర్లు, సిబ్బంది ఉన్నారు. రుద్రూర్ మండలం పోతంగల్‌లో తహసీల్దార్ రమేశ్ దరఖాస్తులను స్వీకరించారు. సర్పంచ్ వర్ని శంకర్, ఆయాశాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



పోతంగల్‌లో దరఖాస్తుల స్వీకరణ..



బోధన్ పట్టణంలో..

రోడ్డు మధ్యలో విద్యుత్‌స్తంభాలు



సీసీ రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్‌స్తంభం

భీమ్‌గల్ : శాఖల మధ్య సమన్వయ లోపం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని బాబాపూర్ గ్రామంలో రోడ్డు మధ్యలో కరెంట్ స్తంభాలు ఉన్నాయి. రోడ్డు వేసే ముందు విద్యుత్ స్తంభాలను పక్కకు జరిపి ప్రణాళికాబద్ధంగా పనులను చేపట్టాలి. కానీ బాబాపూర్ గ్రామంలో గతంలో లక్షలాది రూపాయలు వెచ్చించి సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. పంచాయతీ అధికారులు, విద్యుత్ శాఖ అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు అలాగే ఉండిపోయాయి. అలాగే రోడ్డు పనులను కానిచ్చేశారు. అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డు విశాలంగా మారినప్పటికీ మధ్యలో విద్యుత్‌స్తంభాల కారణంగా ప్రమాదాలబారిన పడుతామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మధ్యలోనుంచి విద్యుత్ స్తంభాలను తొలగించాలని కోరుతున్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



పీఆర్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో

బోధన్‌టౌన్/రెంజల్/రుద్రూర్: పీఆర్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బోధన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీవో రాజాగౌడ్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవ సమాజం నిర్మించే శక్తి ఉపాధ్యాయులకు ఉందని, సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. బోధన్ డివిజన్ ఇన్‌చార్జి శంకర్, ప్రధాన కార్యదర్శి ధన్‌రాజ్, పట్టణ ప్రధాన కార్యదర్శి గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రెంజల్ ఎంపీడీవో కార్యాలయంలో పీఆర్టీయూ క్యాలెండర్, గోడప్రతులను ఎంపీపీ లోలపు రజిని, జెడ్పీటీసీ మేక విజయతోపాటు ఎంఈవో రామారావు, యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఇల్తెపు శంకర్ ఆవిష్కరించారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమలింగంగౌడ్, సాయారెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు రాజేందర్‌సింగ్, మండల బాధ్యులు అబ్బయ్య, కిషోర్, రహమాన్, సతీశ్ వ్యాస్, తాహెర్, గోవర్దన్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. రుద్రూర్ మండలం రాయకూర్, సులేమాన్‌నగర్ గ్రామాల్లో వికసిత్ భారత్ క్యాలెండర్లను అధికారులు ఆవిష్కరించారు. సర్పంచులు బేగరి గంగారాం, ఖాదర్, ఎంపీడీవో బాలగంగాధర్, బ్యాంకు సిబ్బంది, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.



సులేమాన్‌నగర్‌లో వికసిత్ భారత్ క్యాలెండర్ ఆవిష్కరణ..

యాంటీడ్రగ్ కమిటీ ఎన్నిక

మాక్లూర్: గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల నివారణ కోసం ముందస్తుగా యాంటీ డ్రగ్ కమిటీని నియమించినట్లు మాక్లూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గంగారాం గురువారం తెలిపారు. అధ్యక్షుడిగా గంగారాం, ఉపాధ్యక్షుడిగా ఎ గంగాధర్, సభ్యులుగా జాఫర్, శివకుమార్, నాగమణి, రవీందర్‌రావు, రాణా సంగ్రామ సింహుడు, ఎస్సై సుధీర్‌రావు, ఎస్ పోతన్న, నితీశ్, జగదీశ్ ఉన్నారన్నారు.

ఉన్నతి కార్యక్రమం పరిశీలన

మోర్తాడ్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ఉన్నతి కార్యక్రమాన్ని స్టేట్ రిసోర్స్ పర్సన్ లక్ష్మీనాథం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉన్నతి కార్యక్రమాన్ని ఏ విధంగా ముందుకు తీసుకువెళ్లాలి అనే అంశంపై ఉపాధ్యాయులకు ఆయన సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థిని గాయత్రి జాతీయస్థాయి ఫెడరేషన్ కప్ టోర్నమెంట్ మూడు కిలోమీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించింది. గాయత్రిని కళాశాల ప్రిన్సిపాల్ అక్బరీబేగం గురువారం అభినందించారు. యూపీలోని మథుర పట్టణంలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో గాయత్రి ఈ ఘనతను సాధించినట్లు తెలిపారు. పీడీ గంగాధర్, అధ్యాపకులు దేవారాం, వెంకటేశ్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



మోర్తాడ్: మండలంలోని తిమ్మాపూర్‌లో శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి గురువారం బహుమతులను అందజేశారు. కబడ్డీలో ప్రథమ బహుమతిని కొత్తపల్లి జట్టు, ద్వితీయ బహుమతిని తిమ్మాపూర్ జట్లు కైవసం చేసుకున్నాయి. వాలీబాల్‌లో కమ్మర్‌పల్లి ప్రథమ, కోరుట్ల ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు సర్పంచ్ చిన్నారెడ్డి, ఎంపీటీసీ ఆస్మా, సహకార సంఘం చైర్మన్ కల్లెం అశోక్‌రెడ్డి, ఉప సర్పంచ్ నవీన్ బహుమతులను అందజేశారు. వీడీసీ, దేవాలయ కమిటీల సభ్యులతోపాటు పీఈటీలు శ్యామ్, రాజేందర్, నరేంద్రాచారి, రాజేశ్, సురేందర్, ప్రేమ్‌కుమార్, నాగేశ్, నరేందర్, సురేశ్, రాజశేఖర్, శశికుమార్ పాల్గొన్నారు.

వాటర్ ప్యూరిఫైయర్ వితరణ



కమ్మర్‌పల్లి: మండలం కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వాషింగ్టన్ తెలంగాణా ఆర్గనైజేషన్ అనే స్వచ్ఛంద సంస్థ రూ.1.20 లక్షల విలువ చేసే వాటర్ ప్యూరిఫైయర్, కూలర్‌ను అందజేసింది. ఈమేరకు సంస్థ ప్రతినిధులు గిరీశ్, శశిధర్‌రెడ్డి గురువారం వాటర్ ప్యూరిఫైయర్, కూలర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం చౌడారపు రాంప్రసాద్, సర్పంచ్ దయ్య దేవయ్య, జెడ్పీటీసీ శ్రీమతి రాధ, ఉప సర్పంచ్ టేకుల జలందర్, ఎంపీటీసీ గంగాధర్, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షురాలు లక్ష్మీనారాయణ, గ్రామ విద్య అభివృద్ధి కమిటీ సభ్యులు టేకుల సంజీవ్, రవి, ప్రభాకర్‌రెడ్డి, టేకుల రాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అపురూప ఆలయంలో మంత్రి పూజలు



మంత్రికి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లి శివారులో ఉన్న అపురూప వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని రాష్ట్ర ఆరోగ్యశాఖమంత్రి దామోదర నరసింహ గురువారం దర్శించుకున్నారు. మంత్రి రాక సందర్భంగా ఆలయ నిర్వాహకులు అమృతలత, ప్రభ, సురేందర్‌రెడ్డి, సుజాత ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి వినయ్‌రెడ్డి, కరిపె రాజేశ్వర్, బాలపురం దయాకర్ రావు, రవిప్రకాశ్, జైల్‌సింగ్ మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంత్రిని సన్మానించారు. ఆయన వెంట నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు గడుగు గంగాధర్, సుభాష్‌జాదవ్ ఉన్నారు. ఆర్మూర్, నిజామాబాద్, బోధన్, బాల్కొండ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న జేఏసీ ప్రతినిధులు

బోధన్‌టౌన్(బోధన్): తెలంగాణ ఉద్యమకారుల కోసం ప్రభుత్వం సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని బోధన్ జేఏసీ కన్వీనర్ గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి మల్లేశ్, స్టీరింగ్ కమిటీ నాయకుడు శివరాజ్ కోరారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఉన్న అమరవీరుల స్తూపం వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమకారులను గుర్తించడం అభినందనీయమని, వారికి 250 గజాల ఇంటి స్థలం కేటాయించడంతో పాటు వారి సంక్షేమానికి కృషి చేస్తామని ప్రకటించడం శుభపరిణామమని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ ఉద్యమకారులను విస్మరించారని, ప్రొఫెసర్ కోదండరాంను అరెస్టు చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాచౌక్‌ను ఎత్తివేసి ప్రజల గొంతుకను అణిచి వేశారన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో 1519 రోజులు దీక్షలు కొనసాగించిన స్థలంలో పైలాన్‌ను నిర్మించాలని కోరారు. సమావేశంలో మహేందర్‌రెడ్డి, కె శంకర్, పడాల శంకర్, ముత్తన్న, భాగ్యరాజ్, యూసుఫ్, షేక్ పాషా, మాధవరావు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు స్థలం కేటాయించాలి



ధర్నా నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న మధుమలాంచ జూనియర్ కళాశాలకు శాశ్వత భవనం కోసం స్థలాన్ని కేటాయించాలని ఏబీవీపీ నగర కార్యదర్శి మొగులాజీ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మొగులాజీ మాట్లాడుతూ.. మధుమలాంచ జూనియర్ కళాశాలకు శాశ్వత భవనం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, కళాశాల భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. ప్రవీణ్, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న డీఐఈవో రఘురాజ్

ఆర్మూర్‌టౌన్: రాబోయే ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా అధ్యాపకులు కృషిచేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రఘురాజ్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాలను గురువారం డీఐఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. విద్యార్థినులు పరీక్షలకు సన్నద్ధమయ్యేలా చూడాలని అన్నారు. స్టడీ అవర్స్ ఏ విధంగా నిర్వహిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్యాబోధన అందుతుందన్నారు. ప్రిన్సిపాల్ అక్బర్‌బేగం, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ

బాల్కొండ: యాసంగిలో రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలని భీమ్‌గల్ వ్యవసాయ శాఖ ఏడీఏ మల్లయ్య అన్నారు. గురువారం బాల్కొండ మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరువులు కొనుగోలు చేసిన ప్రతి రైతుకూ బిల్లు అందించాలన్నారు.

ఎరువుల నిల్వ నివేదికను రోజువారీగా అందించాలన్నారు. ఎరువులు అందుబాటులో ఉంచకపోవడంతోపాటు ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకంటామని హెచ్చరించారు. ఆయన వెంట వ్యవసాయ అధికారి మహేందర్‌రెడ్డి, సిబ్బంది తదితరులున్నారు.

స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్



కమ్మర్‌పల్లి : మండలంలోని చౌట్‌పల్లి బాలికల ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ప్రాథమిక స్థాయి పాఠశాల సముదాయ సమావేశం నిర్వహించారు. పాఠశాలలో ఎఫ్ఎల్ నిర్వహణ పద్ధతులను, లైబ్రరీ నిర్వహణ, గణితం, ఆంగ్లం సబ్జెక్టులకు సంబంధించి బోధన పద్ధతులను వివరించారు. సమావేశంలో గంగాధర్, ఎంఈవో ఆంధ్రయ్య, వెంకటేశ్వర్లు, కిషన్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – రైట్(తెలుగు) -10.05, ఉమాపతి-7.00
బద్మాష్ గాళ్లకు..(తెలుగు)- 12.55
హాయ్ నాన్న(తెలుగు)- 3.45, డంకీ (హిందీ)- 10.30

స్క్రీన్-2 – సలార్ (తెలుగు)- 11.00, 2.35, 6.10, 9.45

స్క్రీన్-3 – డెవిల్(తెలుగు) - 12.00, 3.10, 6.20, 9.30

స్క్రీన్-4 – సలార్ (తెలుగు) - 12.15
బబుల్‌గమ్ - 3.50, 7.00
సలార్ (హిందీ) : 10:10